సాక్షి
ములుగు
శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023

ఓటు వేసేందుకు వెళ్తూ అనంతలోకాలకు..

కొమ్మూరి వర్సెస్ పల్లా
● పరుష పదజాలంతో మాటలు
● నాలుగు చోట్ల లాఠీచార్జ్

ఓటర్లపై పోలీసుల దురుసు ప్రవర్తన - 8లో

ఉద్రిక్తతలు.. ఘర్షణలు
● పోలింగ్‌కేంద్రాల వద్ద వివిధ పార్టీల శ్రేణుల బాహాబాహీ - 8లో

పోల్.. కూల్
● ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఓటర్ల సందడి
● ఓటేసిన ప్రముఖులు

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్ - 9లో

గరిష్టం/కనిష్టం
34.6°/18.3°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలితో పాటు మంచు కురుస్తుంది.

యువోత్సాహం..


రాంనగర్‌లో నూతన ఓటు వేసిన యువతులు

ఏటూరునాగారం: అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కు వచ్చిన యువత ఓటు వేసేందుకు ఉత్సాహం చూపారు. పోలింగ్ బూత్‌లకు తరలివచ్చి క్యూలైన్లలో వేచి ఉన్నారు. పలువురు తొలిసారిగా ఓటు వేసి సంతోషం వ్యక్తం చేశారు.

ఆనందంగా ఉంది..



నాకు ఓటు రావడం సంతోషంగా ఉంది. గొత్తికోయగూడెంలో ఉంటున్న తనకు కొత్తగా ఓటు దరఖాస్తు పెట్టుకోగా వచ్చింది. ఇప్పుడు ఓటు వేసిన. అమ్మనాన్నకు ఓటు ఉండడంతో వారిని అడిగేదానిని.. ఓటు ఎలా వేస్తారని. ఇప్పుడు ఓటు వేయడం వల్ల నాకు కూడా అవగాహన వచ్చింది.

- దూబె సన్నీ, గంటలకుంట, ఏటూరునాగారం

ఒకేసారి వచ్చాము..


ఒకేసారి అక్క చెల్లెలు ఓటు వేసిన దృశ్యం

దరఖాస్తు చేసుకున్న ఏడాది వ్యవధిలోనే ఓటు వచ్చింది. దీంతో ఒకరు బీటెక్, మరొకరు డిగ్రీ చదువుతుండగా వరంగల్ నుంచి వచ్చి ఓటు వేశారు. దీంతో ఇరువురు ఒకేసారి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మరుపురానిది..



మంగపేట: మొదటి సారిగా ఓటు వేయడం మరుపురానిది. ఏడాది కిత్రం వరకు కమలాపురంలోనే ఉండే వాళ్లం. మా తండ్రి ఉపాధ్యాయుడిగా పనిచేస్తుంటాడు. ఇటీవల హనుమకొండకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో హనుమకొండ నుంచి వచ్చి ఓటు వేశారు.

- గూదె సుసానాజాస్మిని, బీటెక్ విద్యార్థిని

పోలింగ్ ప్రశాంతం


ములుగులో ఓటు వేయడానికి బారులుదీరిన మహిళలు


వెంకటాపురం(కె): ఆలుబాక పోలింగ్ కేంద్రంలో బారులుదీరిన ఓటర్లు

ఈవీఎంల మొరాయింపు
● అక్కడక్కడా ఘర్షణలు
● 4గంటలకు ముగిసిన ఓటింగ్

ములుగు: ములుగు నియోజకవర్గంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. చెదురు ముదురు సంఘటనలు మినహా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. ములుగు, ఏటూరునాగారంలోని పలు పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో పోలింగ్ ప్రక్రియ కొంత ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ క్రమంలో ఓటర్లు కొద్దిపాటి అసహనానికి లోనయ్యారు. జిల్లా కేంద్రంలో వృద్ధులు, వికలాంగుల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఆదర్శ మహిళా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ములుగు ఏజెన్సీ సమస్యాత్మక ప్రాంతం కావడంతో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్‌ను ముగించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించారు. వీడియో సర్వేలైన్స్ టీం పోలింగ్ కేంద్రాల వద్ద చక్కర్లు కొడుతూ వీడియో రికార్డింగ్ చేసింది. జిల్లా అధికారులు, పలు పార్టీల నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థులు స్థానికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

స్ట్రాంగ్ రూంకు ఈవీఎంల తరలింపు
ఎన్నికల ప్రక్రియ ముగింపు అనంతరం వీవీ ప్యాట్ ఓట్లు, ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను సరిచూసుకొని సిబ్బంది సెక్టార్ అధికారులకు మిషన్లు అప్పగించారు. వాటిని పోలీసులు భారీ బందోబస్తు నడుమ కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూంకు తరలించి భద్రపరిచారు. మారుమూల మండలాలైన మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, గంగారం, కొత్తగూడ నుంచి ఈవీఎం మిషన్లు అర్ధరాత్రి వరకు స్ట్రాంగ్ రూంకు చేరుకున్నాయి.

ఓటింగ్ సరళిని పరిశీలించిన అభ్యర్థులు
ప్రధాన పార్టీ అభ్యర్థులు ఓటింగ్ సరళిని పరిశీలించారు. కాంగ్రెస్ అభ్యర్థి సీతక్క జాకారం, మల్లంపల్లి, జగ్గన్నపేటలతో పాటు ఆయా మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. బీజేపీ అభ్యర్థి డాక్టర్ అజ్మీరా ప్రహ్లాద్ జగ్గన్నపేట, ములుగు ప్రభుత్వ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి కాల్వపల్లి, తాడ్వాయి, ములుగు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. బీఎస్పీ అభ్యర్థి భూక్య జంపన్న జగ్గన్నపేట, మదనపల్లి, ములుగు, గోవిందరావుపేట, ఏటూరునాగారం, మంగపేట పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

11గంటల తర్వాత..
మాక్ పోలింగ్ అనంతరం అధికారులు ఉదయం 7గంటల నుంచి ఓటర్లకు అనుమతి ఇచ్చారు. అయితే తొమ్మిది గంటల వరకు మామూలుగా సాగిన ఓటింగ్ తర్వాత కాస్తవేగం పుంజుకుంది. 11గంటల తరువాత మరింత పెరిగింది. ఇక సాయంత్రం నాలుగు గంటల తరువాత తక్కువ సంఖ్యలో ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ రాత్రి 9గంటల వరకు సాగింది. దీంతో ఈవీఎం మిషన్లు జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి ఆలస్యమైంది.

ఓటింగ్ శాతం పెరిగే అవకాశం
గత అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో 82.75 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. ఈ సారి గురువారం రాత్రి 12గంటల వరకు అందిన సమాచారం మేరకు 82శాతంగా ఓటింగ్ నమోదు అయినట్లుగా తెలిసింది. ఈ శాతం పెరిగే అవకాశం ఉంది.



క్యూలో వెళ్లి ఓటేసిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని ఆదర్శ మహిళా పోలింగ్ కేంద్రంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ తోటి మహిళలతో కలిసి క్యూ లైన్‌లో నిలబడి వెళ్లి ఓటు వేశారు. అనంతరం ఓటింగ్ ప్రక్రియను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు.

తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్న యువతులు



కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేయడానికి వచ్చిన 105 ఏళ్ల బామ్మ


ఓటు వేయడానికి వాకింగ్ స్టిక్‌తో పోలింగ్ కేంద్రానికి వచ్చిన యువకుడు

పోలింగ్ వివరాలు

నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌లు	303
ఓటర్లు	2,26,326
పోలింగ్ శాతం	82


వెంకటాపురం(ఎం)లో..


ఈవీఎం మిషన్లతో ములుగులోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకున్న ఉద్యోగులు

ఈవీఎం మొరాయింపు..


ఈవీఎంను మారుస్తున్న పోలింగ్ సిబ్బంది

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని 45వ పోలింగ్ కేంద్రంలో ఉదయం 7 గంటలకు మొదలు కావాల్సిన పోలింగ్ ఈవీఎంలు మొరాయించాయి. దీంతో రెండు గంటల అనంతరం 9గంటలకు పోలింగ్ ప్రక్రియ మొదలైంది. సాంకేతిక సమస్యతో క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు బేంచీలపై కూర్చొని కాస్త సేదదీరారు. చిన్నపిల్లలతో తల్లులు ఇబ్బందులు పడ్డారు. ఈ బూత్‌లో 888 ఓట్లు ఉండగా మాక్‌పోలింగ్ 41 మంది వేసిన తర్వాత ఈవీఎంలు మొరాయించాయి. విషయం తెలుసుకున్న సెక్టార్ అధికారులు అశ్విన్, లక్ష్మీనారాయణలు అక్కడికి చేరుకుని ఈవీఎంలను మార్చి పోలింగ్ సజావుగా సాగేలా చర్యలు చేపట్టారు.

11నుంచి బీటెక్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి బీటెక్ నాలుగో సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు సీబీసీఎస్ రెగ్యులర్, ఎక్స్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ విద్యార్థులకు డిసెంబర్ 11 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 11, 13, 15, 18, 20, 22వ తేదీల్లో పరీక్షలు జరగనున్నాయని వారు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు.

నేటి నుంచి కొత్త వైన్స్

కాజీపేట అర్బన్: టెండర్‌లో దక్కించుకున్న 65 వైన్స్‌ను శుక్రవారం నుంచి ప్రారంభించనున్నారు. రూ.2 లక్షల దరఖాస్తు ఫీజుతో 2023– 25 ఏడాదికి గాను రెండేళ్ల కాల పరిమితితో వైన్స్‌లు దక్కించుకున్న వారికి మద్యం విక్రయాలతో లక్కు కిక్కు దక్కనుంది. కాగా.. సేల్స్ బాగుందంటూ ఇప్పటికే కొనసాగుతున్న వైన్స్‌ల్లోనే.. కొత్తవి ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

వాగులు.. గుట్టలు దాటి..

ఓటేసిన పెనుగోలు వాసులు
● మూడు గుట్టలు, మూడు వాగులు దాటిన ఆదివాసీలు
● 16 కిలో మీటర్లు నడక.. మా బతుకులు మారవా అంటూ ఆగ్రహం
● రహదారి, విద్య, వైద్యం, విద్యుత్, తాగు నీరు, ఇళ్లు ఇవ్వాలని డిమాండ్


మాట్లాడుతున్న పెనుగోలు వాసులు

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధి కొంగాల గ్రామపంచాయతీ పరిధిలోని పెనుగోలు గ్రామమిది. గుట్టలపై నున్న ఆదివాసీల కుగ్రామం. ఇక్కడ 12 కుటుంబాలు, 30 మంది జనాభా ఉన్నారు. ఈ గ్రామంలో 19 మంది ఓటర్లు ఉన్నారు. రాజ్యాంగం తమకు కల్పించిన ఓటు హక్కును క్రమం తప్పకుండా వినియోగించు కుంటున్నారు. వీరు ఓటు వేయాలంటే మూడు గుట్టలు దిగడంతోపాటు మూడు చోట్ల వాగులను దాటాలి. వ్యయ ప్రయాసలకు ఓర్చి వీరికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతీసారి వినియోగించుకుంటూనే ఉన్నారు. ఈసారి కూడా గురువారం జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గుట్టలు దిగి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసిన తరువాత వారు తమ గోడును విలేకరుల ఎదుట వెళ్లబోసుకున్నారు. ఎన్ని పార్టీలు అధికారంలో ఉన్నా తమ గోడును పట్టించుకోవడం లేదని, ఆ కారణంగానే ఈసారి ఎన్నికలకు దూరంగా ఉండాలని అనుకున్నామని పేర్కొన్నారు. కానీ రాజ్యాంగం కల్పించిన హక్కును ఉపయోగించుకోవాలని గుట్టలు దిగి వచ్చి ఓటు వేసినట్లు తెలిపారు. తమను ఓట్ల కోసం వాడుకుంటూ ఎన్నికల తరువాత పట్టించు కోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టలపై నున్న ఆదివాసీలమైన తమను మాత్రం అటు ప్రభుత్వాలు, ఇటు అధికారులు, మరో వైపు నాయకులు పట్టించుకోవడం లేదన్నారు. కేవలం జనాభా లెక్కలు, ఓట్ల కోసం పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు.

విద్య, వైద్యం, విద్యుత్, రహదారులు, తాగునీరు, ఇందిరమ్మ ఇళ్లు లేవు
పెనుగోలు గ్రామానికి వెల్లడానికి రహదారి సౌకర్యం లేదు. రాళ్లదారిలో వాగులు, వంకలను దాటుకుంటూ వెళ్లాలి. ఏ పని మీద రావాలన్నా గుట్టలు దిగి రాళ్లదారిలోనే రావాలి. తాగునీటి వనరులు వాగులు, ఒక బావి మాత్రమే. బావిలోని నీరు పచ్చబడి ప్రమాదభరితంగా ఉంటుంది. సమీపంలో ఉన్న పాల వాగు, నల్ల వాగుల నీటిని తాగాల్సి వస్తుందన్నారు. గ్రామంలో విద్యుత్ సౌకర్యం లేదు. గతంలో రెండు పర్యాయాలు సోలార్ సిస్టం ద్వారా విద్యుత్ అందించేందుకు సర్వేలను నిర్వహించి మూడవ విడత ఏర్పాటు చేశారు. కానీ అది పూర్తి స్థాయిలో ఆచరణలోకి రాలేదు. తమకు ఏ రోగం, రొప్పి వచ్చినా వైద్యం అందదు. గుట్టల పైనున్న తమ గ్రామానికి ప్రభుత్వ వైద్యులు రారు. ఒక ఏఎన్ఎమ్ మాత్రం వచ్చి వెళుతుంది. జ్వర మొచ్చినా, నొప్పి వచ్చినా రోగులు కిందకు రావాల్సిందే. సరైన వైద్య సౌకర్యం లేక పోవడంతో రోగులను వైద్యం కోసం గుట్టలు దింపి వాజేడు, వెంకటాపురం(కె), భద్రాచలం, వరంగల్‌లో ఉన్న వైద్య శాలలకు తరలించాల్సి వస్తుంది. ఆస్పత్రికి రోగులను తీసుకు రావాలంటే నడిం కావడిలో రోగిని మోసుకొని రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

పట్టించు కోని ప్రభుత్వాలు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలో ఉన్న తమ సమస్యలను పట్టించుకోవడం లేదు. మేము భద్రాచలం నియోజక వర్గంలో ఉన్నప్పటికి ఇక్కడి ఎమ్మెల్యేలు సైతం పట్టించుకోలేదు. మా సమస్యలు పరిష్కరించకపోయినా క్రమం తప్పకుండా ఓటు వేస్తున్నాం. ప్రభుత్వాలు మా గురించి ఆలోచన చేయాలి.

- ఉయిక సమ్మయ్య

వైద్యం, ఇళ్లు అందించాలి



అసలు మేము ఉన్నామో లేమో తెలియనప్పుడు ఓట్లను ఎలా వే యాలని అనుకున్నం. అయినా మా హక్కును సద్వినియోగం చేసుకున్నాం. మాకు ప్రభుత్వం ద్వారా పక్కా ఇళ్లు, వైద్యం అందించాలి.

- రమాశ్రీ

ఈసారి పరిష్కారం జరగాలి



ఈ సారి ప్రభుత్వం ద్వారా మా సమస్యల పరిష్కారం జరుగాలి. మేము రహదారి సౌకర్యం, తాగు నీరు అందక ఇబ్బంది పడుతున్నాము. కరెంటు లేదు. పోడు సాగుతో జీవనం సాగిస్తున్నాము. ఈ సారైన ప్రభుత్వం మా సమస్యలను పరిష్కరించాలి.

- మల్లయ్య

విద్య అందడం లేదు



విద్య అందని ద్రాక్షగా మారింది. మా గ్రామంలో ఉన్న విద్యార్థులను చదివించుకోవాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాలను నిర్మించి ఉపాధ్యాయులను నియమించాలి.

- కళ్యాణి

ఓటేసిన అభ్యర్థులు..


ఓటు వేసిన సీతక్క, కుటుంబ సభ్యులు


బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి


బీజేపీ అభ్యర్థి అజ్మీరా ప్రహ్లాద్


బీఎస్పీ అభ్యర్థి భూక్య జంపన్న

ములుగు రూరల్: ములుగు నియోజకవర్గంలోని శాసనసభ ఎన్నికల బరిలో నిలిచిన ముగ్గురు అభ్యర్థులు ఒకే గ్రామ పంచాయతీ చెందిన అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈ మేరకు గురువారం జగ్గన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం (173)లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ధనసరి సీతక్క, బీజేపీ అభ్యర్థి అజ్మీరా ప్రహ్లాద్, బీఎస్పీ అభ్యర్థి భూక్య జంపన్నలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒకే గ్రామ పంచాయతీ పరిధిలో ముగ్గురు అభ్యర్థులు అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలవడంతో పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదే విధంగా ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని కాల్వపల్లిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి ఓటు వేశారు.

బీఆర్ఎస్ నాయకుడి ఇంటి ఎదుట నిరసన


తలుపులు తెరిచేందుకు ప్రయత్నిస్తున్న ఓటర్లు


బీఆర్ఎస్ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ..

మంగపేట: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నేత, మాజీ జెడ్పీటీసీ సిద్దంశెట్టి వైకుంఠం ఇంటి ఎదుట గంపోనిగూడెంకు చెందిన సుమారు 30 మంది ఓటర్లు గురువారం నిరసన తెలిపారు. ఓట్ల కోసం డబ్బులు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేసిన నాయకులు వైకుంఠం ఇంట్లో ఉన్నారన్న సమాచారం మేరకు వారిని నిలదీసేందుకు ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. గమనించిన ఇంట్లో ఉన్న కొందరు బీఆర్ఎస్ నాయకులు ఇంట్లోకి రాకుండా అడ్డుకునేందుకు తలుపులు వేసేందుకు ప్రయత్నించారు. దీంతో మరింత ఆగ్రహించిన ఓటర్లు బలవంతంగా తలుపులను నెట్టుకుని ఇంట్లోకి వెళ్లారు. దీంతో అక్కడ నుంచి బీఆర్ఎస్ నాయకులు వెళ్లిపోయారు. దీంతో మహిళలు వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని అందకు గాను ఒక్కో ఓటుకు వెయ్యి రూపాయలు ఇస్తామని చెప్పిన కొందరు నాయకులు పార్టీ నుంచి లక్షల రూపాయలు తీసుకుని వారి బంధువులకు కొందరికిచ్చి తమకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుండా దాచుకున్నారని ఆరోపించారు. తమ పేర్లు చెప్పి డబ్బులు తెచ్చుకుని తమకు ఇవ్వకుండా మోసం చేస్తారా అంటూ మండిపడ్డారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న మరి కొందరు బీఆర్ఎస్ నాయకులు మీ గ్రామంలో డబ్బులు పంపిణీ చేసిన వారిని మీరు ప్రశ్నించాలి తప్ప సంబంధం లేని వేరొకరి ఇంట్లోకి రావడం పద్ధతి కాదన్నారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఓటర్లకు సర్దిచెప్పి పంపించారు.

క్లుప్తంగా

ఓటువేసేందుకు వెళ్తూ.. అనంతలోకాలకు..

- గోవిందాపూర్‌లో రోడ్డు ప్రమాదం
- అక్కడికక్కడే చిన్నారి మృతి, తండ్రికి తీవ్ర గాయాలు..

శాయంపేట/ భూపాలపల్లి రూరల్ : శాయంపేట మండలంలోని గోవిందాపూర్ దర్గా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా నేరేడుపల్లి గ్రామానికి చెందిన బోడకుంట్ల రాంబాబు హనుమకొండలో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం ఎన్నికలలో తన ఓటు వినియోగించుకోవడానికి కూతురు సింధు వైష్ణవి(8)ని తీసుకుని ద్విచక్ర వాహనంపై నేరేడుపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో గోవిందాపూర్ దర్గా సమీపంలో గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొనడంతో సింధువైష్ణవి అక్కడికక్కడే మృతి చెందింది. రాంబాబుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో వృద్ధురాలు..

కేసముద్రం: ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లడానికి సిద్ధమైన ఓ వృద్ధురాలు గుండె పోటుతో మృతి చెందింది. ఈ ఘటన గురువారం మండలంలోని కేసముద్రంవిలేజ్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొలిపాక వెంకటమ్మ(80) ఓటు వేయడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లే క్రమంలో గుండె పోటుకు గురై మృతి చెందింది.

ఓటు వేసిన గంటకు అనారోగ్యంతో వృద్ధుడు..


ఎల్లయ్య(ఫైల్)

సంగెం: ఓటు హక్కు వినియోగించుకుని ఇంటికి వచ్చిన గంటకు అనారోగ్యంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన సంగెంలో జరిగింది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సింగారపు ఎల్లయ్య(65) గురువారం ఓటు హక్కు వినియోగించుకున్నాడు. ఇంటికి వెళ్లిన గంట తర్వాత తుది శ్వాస విడిచాడు. మృతుడికి భార్య సూరమ్మ, నలుగురు కూతుళ్లు ఉన్నారు.

పల్లా వర్సెస్ కొమ్మూరి..

- పరుష పదజాలంతో దూషణల పర్వం
- అడుగడుగునా టెన్షన్.. టెన్షన్
- పలుచోట్ల లాఠీచార్జ్
- రంగంలోకి డీసీపీ, ఏసీపీ, పోలీసు బలగాలు
- పసరమడ్లలో కాంగ్రెస్‌కు ఓట్లు వేయిస్తున్నారని అభ్యంతరం


జనగామ ప్రభుత్వ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఆయా పార్టీల శ్రేణుల మధ్య వాగ్వాదం

జనగామ: తెలంగాణ అసెంబ్లీ పోలింగ్ సందర్భంగా గురువారం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య జరిగిన ఉద్రిక్త పరిస్థితులు పోలీసులకు ముచ్చెమటలు పట్టించాయి. బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఆయన సతీమణి నీలిమ, కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఆయన తనయుడు ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి, ఆయా పార్టీల కేడర్ ఎదురు పడితేచాలు.. మాటల తూటాలు అగ్గిరాజేశాయి. దీంతో పోలీసు శాఖ అలర్ట్ అయింది. డీసీపీ సీతారాం నేతృత్వంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, స్థానిక పోలీసులతో పాటు బీఎస్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారనున్న నేపథ్యంలో అదనపు బలగాలు రప్పించారు.జనగామ పట్టణం, మండల పరిధిలో జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలోని 8 మండలాలను అలర్ట్ చేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఇరు కుటుంబాల సభ్యులు, ఆరుట్ల దశమంతరెడ్డి ఆయా మండలాల పరిధిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించే క్రమంలో పోలీసులు రెగ్యులర్ కంటే అదనంగా బందోబస్తు చేపట్టారు.

అడుగడుగునా టెన్షన్ టెన్షన్..

జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ పోలింగ్ కేంద్రానికి పల్లా సతీమణి నీలిమ వెళ్లగా, అదే సమయంలో కొమ్మూరి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి, కోడలు దివ్య కూడా వెళ్లారు. ప్రతి చోటకు తమ వెనకనే రావడం ఏంటని నీలిమ వారిని నిలదీశారు. బయట నుంచి ప్రైవేట్ వ్యక్తులను తీసుకొచ్చి దొంగ ఓట్లు వేయిస్తున్నారని ప్రశాంత్‌రెడ్డి నిలదీయడంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం జరిగింది. విషయం తెలుసుకున్న ఇరుపార్టీల శ్రేణులు ఘటనాస్థలికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. డీసీపీ వచ్చి నీలిమ, ప్రశాంత్‌రెడ్డికి నచ్చ చెప్పి పంపించారు. అయితే ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎంతకూ వినకపోవడంతో చెదరగొట్టారు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ ఏరియా ప్రభుత్వ స్కూల్ పోలింగ్ కేంద్రానికి పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాగా, ఆయన వెంట ఉన్న ఓ వ్యక్తిని ఆయా పార్టీల నాయకులు అనుమానించడంతో.. అక్కడే ఉన్న బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, సీపీఎం నాయకులు జత కలవడంతో ఆ వ్యక్తిని


ఘర్షణ పడుతున్న కార్యకర్తలను అపుతున్న పోలీసులు


లాఠీచార్జ్ చేస్తున్న పోలీసులు

చితక బాదారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు సైతం రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు మరోసారి చెదరగొట్టారు.

అభ్యర్థుల పరుష పదజాలం..

గొడవ సద్దుమణిగిందనుకుంటున్న తరుణంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి పట్టణంలోని గ్రెయిన్ మార్కెట్ పోలింగ్ కేంద్రానికి రాగా అనుచరవర్గంతో ఎలా వస్తారని కాంగ్రెస్ శ్రేణులు నిలదీశాయి. కొమ్మూరి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి కూడా ఆగ్రహం వ్యక్తం చేయడం, ఇరువురి వాహనాలకు కేడర్ అడ్డుతగలడంతో స్వల్ప ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. లాఠీ చార్జ్ చేసే వరకూ కార్యకర్తలు అక్కడ నుంచి కదల లేదు. గ్రెయిన్ మార్కెట్ నుంచి పల్లా నేరుగా జనగామ మండలం శామీర్‌పేట పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ సైతం గులాబీ కండువా వివాదం తలెత్తడం, అదే సమయంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రావడంతో ఇరువురు పరుష పదజాలంతో దూషించుకున్నారు. చూసుకుందాం అంటే.. చూసుకుందాం అంటూ సవాల్ విసురుకున్నారు. దీంతో రెండు పార్టీల నేతలు, కార్యకర్తలు నినాదాలతో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇరు వర్గాలను పోలీసులు బలవంతంగా బయటకు తీసుకురాగా, అక్కడ కేడర్ అడ్డుపడ్డారు. ఇరువురు ఘర్షణపడే సమయంలో పోలీసులు ఎక్కడికక్కడ లాఠీలతో చెదరగొట్టారు. అలాగే, కొమ్మూరి వెళ్లే క్రమంలో పోలింగ్ కేంద్రానికి కొద్ది దూరంలో పార్టీ శ్రేణులతో మాట్లాడేందుకు ఆగగా, అటువైపు బీఆర్ఎస్ శ్రేణులు కదలడంతో గ్రహించిన పోలీసులు, వారిని అక్కడే నిలిపివేశారు.

పసరమడ్లలో ఉద్రిక్తత

జనగామ మండలం పసరమడ్లలోని ఓ పోలింగ్ బూత్‌లో ఓ బీఎల్ఓ వృద్ధురాలిని తీసుకెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేయిస్తున్నారని బీఆర్ఎస్ ఏజెంట్ ఆరోపించారు. వెంటనే పల్లా సతీమణి నీలిమకు సమాచారం అందించగా ఆమె తమ అనుచరులతో కలిసి అక్కడకు వెళ్లారు. ఈ విషయమై నీలిమ నిలదీయంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. అంతకు ముందుగానే పోలీసులకు సమాచారం రావడంతో అక్కడ ఎలాంటి దాడులు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. జనగామ మండలం గోపిరాజుపల్లిలో ఆయా పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అలాగే ఓబుల్‌కేశ్వాపూర్, వడ్లకొండ గ్రామాల్లో సైతం స్వల్ప ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

ఉద్రిక్తతలు.. ఘర్షణలు


ఏటూరునాగారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల తోపులాట


ఖానాపురం: బుధరావుపేటలో ఘర్షణ పడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

- పోలింగ్ కేంద్రాల వద్ద పలు పార్టీల శ్రేణుల బాహాబాహీ
- ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన కేంద్రం బయట పోలింగ్ సమయం 4 గంటలు దాటగానే చివరి నిమిషాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు ఒకరినొకరు దూషించుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్క పోలింగ్ కేంద్రంలోకి వస్తుండగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ఓడిపోతుందని నినాదాలు చేయడంతో ఘర్షణ నెలకొంది. అలాగే, బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి ఓడిపోతుందని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొనడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో సీఐ మండల రాజు, సిబ్బంది వారిని చెదరగొట్టారు.

ఖానాపురంలో..

ఖానాపురం: మండల వ్యాప్తంగా పలు పోలింగ్ బూత్‌ల్లో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పోలింగ్ బూత్‌ల్లోకి వచ్చి ప్రచారం చేపట్టారు. దీంతో ఇరువర్గాలు పరస్పర దూషణలకు దిగడంతో ఘర్షణలు జరిగాయి. అశోక్‌నగర్, బుధరావుపేట, ఖానాపురం, కొడ్తిమాటుతండాతో పాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణలు చోటు చేసుకొని ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. ఖానాపురం, బుధరావుపేట, అశోక్‌నగర్ పోలింగ్ బూత్‌లలో ఇరువర్గాలు పరస్పర దాడులకు పాల్పడ్డాయి. దీంతో ఘర్షణల నడుమ పోలింగ్ కొనసాగింది. ఘర్షణల సందర్భంగా ఇరు వర్గాలను సీఐ పుల్యాల కిషన్, ఎస్సై మాధవ్ చెదరగొట్టారు. పలు పోలింగ్ బూత్‌లను ఏసీపీ తిరుమల్ పరిశీలించి పలు సూచనలు చేశారు.

పర్వతగిరిలో..

పర్వతగిరి: మండల కేంద్రంలోని పోలింగ్ బూత్ బయట బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య గొడవ జరిగింది. బీఆర్ఎస్ కార్యకర్తలు పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. ఒకే సారి గుంపుగా పోలింగ్ బూత్ వద్దకు రావడం సరికాదని కాంగ్రెస్ నాయకులు పేర్కొనగా ఇరుపార్టీల శ్రేణులు మధ్య గొడవ జరిగింది.

ఓటర్లపై పోలీసుల దురుసు ప్రవర్తన


క్షతగాత్రులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొండా సురేఖ

ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్ పెరకవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. సాయంత్రం 4.45 నిమిషాలకు పోలింగ్ బూత్‌కు ఒక్కసారిగా ఓటర్లు భారీగా చేరుకోవడంతో క్యూలైన్‌లో తోపులాట జరిగింది. దీంతో బీఎస్ఎఫ్ బలగాలు ఒక్కసారిగా లాఠీ ఝులిపించారు. దీంతో అవినాష్, జడల సతీష్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొండా సురేఖ క్షతగాత్రులను పరామర్శించారు. సెంట్రల్ డీసీపీ ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

కన్నాయిగూడెంలో..

కన్నాయిగూడెం: మండలంలో జరిగిన పోలింగ్‌లో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముప్పనపల్లిలో ఓటు వేయడానికి క్యూలైన్‌లో ఓటర్లపై సీఆర్పీఎఫ్ సిబ్బంది లాఠీ ఝులిపించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓటర్లు సీఆర్పీఎఫ్ సిబ్బందిపై మూకుమ్మడిగా వెళ్లడంతో వెనుదిరిగారు. కొంత మందికి లాఠీ దెబ్బలతో వాతలు వచ్చాయి.


కన్నాయిగూడెం : చేతిపై కనిపిస్తున్న లాఠీ దెబ్బలు


న్యూశాయంపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న బండా ప్రకాశ్ కుటుంబీకులు


కురవి పెద్ద తండాలో మంత్రి సత్యవతి ..


మానుకోటలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ కవిత కుటుంబ సభ్యులు


భూపాలపల్లిలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి..


జులైవాడలో టీఎస్‌పీఎస్సీ సభ్యుడి కారం రవీందర్‌రెడ్డి దంపతులు


న్యూశాయంపేటలో రావుపద్మ..


హనుమకొండలో సీపీఐ నేత తక్కళ్లపల్లి..


బచ్చన్నపేటలో మాజీ చీఫ్ విప్ బోడకుంటి..


మానుకోటలో కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ ..


శాయంపేట: గోవిందాపూర్‌లో ఓటు వినియోగించుకున్న వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి


నడికూడ: వరికోల్ గ్రామంలో ఓటు వేసిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి


నక్కలగుట్టలో టీఎన్జీవో మాజీ చైర్మన్ సుబ్బారావు..


న్యూశాయంపేటలో మంద కృష్ణ మాదిగ..


హనుమకొండ టీచర్స్‌కాలనీలో ఓటు హక్కు వినియోగించుకున్న కడియం శ్రీహరి కుటుంబీకులు


వరంగల్ ఆంధ్రబాలిక కాలేజీలో ఓటు హక్కు వినియోగించుకున్న మేయర్ గుండు సుధారాణి..


ఏనుగల్లులో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడిన వృద్ధురాలు


జనగామ జిల్లా కేంద్రంలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న మహిళలు

పోల్.. కూల్..

- ప్రశాంతంగా ముగిసిన తెలంగాణ శాసనసభ ఎన్నికలు
- ఉదయం 7 గంటలకే బారులుదీరిన ఓటర్లు
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

తెలంగాణ శాసనసభ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చెదురు ముదురు ఘటనలు మినహా సాఫీగా సాగింది. పోలింగ్ గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై రాత్రి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఓటువేయడానికి ఓటర్లు క్యూలైన్లలో బారులు దీరారు. కొన్ని చోట్లు ఈవీఎంలు మొరాయించగా కొంత సేపు పోలింగ్‌కు అంతరాయం కలిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు


ఏటూరునాగారంలో చిన్నారిని తీసుకుని ఓటు వేసేందుకు వచ్చిన మహిళ


భూపాలపల్లిలో ఓటు వేసేందుకు వృద్ధులు, దివ్యాంగులను తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు, సహాయకులు


కేసముద్రం మండలం అమీనాపురంలో..


హనుమకొండ న్యూశాయంపేటలో..


మహబూబాబాద్: వేమునూరులో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడిన మహిళలు


నర్సంపేటలో ఓటు వేసిన 105 ఏళ్ల వృద్ధురాలు సత్తమ్మ


కరీమాబాద్‌లో ఓటు వేసిన ట్రాన్స్‌జెండర్లు